Office Of The Advisor (communications)
Govt. Of Andhra Pradesh

**Press Release**

# బేడ బుడిగ జంగాల ఆర్థికాభివృద్ధికి చేయూత

## వేయి మంది కళాకారులకు పెన్షన్లు

## బేడబుడిగ జంగాల వారికి పక్కా ఇళ్లు

## ఎస్సీలలో చేర్చడానికి శర్మ ఆధ్వర్యాన కమిటీ

## ఎస్సీలకు కల్పిస్తున్న రాయితీలన్నీ ఇస్తాం

## ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

అమరావతి, మార్చి 27: ఆంధ్రప్రదేశ్ లో బేడ బుడిగ జంగాల సామాజిక వర్గాన్ని ఎస్సీలలో చేర్చేందుకు అధ్యయనానికి విశ్రాంత ఐఏఎస్ అధికారి జె.సి శర్మ నేతృత్వంలో కమిటీ వేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఒకప్పుడు ఈ సామాజిక వర్గానికి చెందిన కళాకారులు భాగవతం, మరికొన్ని కళారూపాలను ప్రదర్శించేవారని, జానపద కళారూపాలతో పల్లెల్లో సందడి చేశారని గుర్తు చేశారు.

అటువంటి కళాకారులను గుర్తించి వారికి కళాకారుల విభాగంలో పెన్షన్లు మంజూరు చేస్తామని, ముందుగా వేయి మంది కళాకారులను గుర్తించి పెన్షన్లు ఇస్తామని చంద్రబాబు తెలిపారు. వీరిలో పేద కళాకారులను గుర్తించి వేయిమందికి పెన్షన్లు ఇస్తామని తెలిపారు. సోమవారం రాత్రి ఉండవల్లిలోని తన నివాస గృహం సమీపంలో ఆరుబయట మైదానంలో ఏర్పాటు చేసిన 'బేడ బుడిగ జంగాల హక్కుల పోరాట మహాసభ'లో ఆయన ప్రసంగించారు.

ఎస్సీలకు కల్పిస్తున్న అన్ని రాయితీలను వీరికి కల్పిస్తామని, చంద్రన్నబీమా వర్తింపజేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. బేడ బుడిగ జంగాల సామాజిక వర్గంలో పెళ్లి చేసుకునే వధువులకు ఎస్సీ వధువులకు ఇస్తున్నట్లుగానే రూ.40,000 మేర పెళ్లికానుకను వర్తింపజేస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. నెలకు రూ.10 వేల ఆదాయం వచ్చేలా తీర్చిదిద్దుతామని నైపుణ్య శిక్షణ ఇప్పిస్తామని సీఎం తెలిపారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 144 ద్వారా బేడ బుడిగ జంగాలకు ఉన్న ఎస్సీ రిజర్వేషన్ తొలగించిందని, ఈ రిజర్వేషన్‌ను పునరుద్ధరించడానికి శర్మ కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాత అధ్యయనం చేసి తగిన నిర్ణయాన్ని ప్రకటిస్తామని చంద్రబాబు వివరించారు.

రాజకీయాల్లో కూడా ఈ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం కల్పిస్తామన్నారు. విదేశాల్లో చదివే విద్యార్థులకు రూ. 10 లక్షల సహాయం అందజేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఎస్సీలకు నిర్మించినట్లే పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పారు.

నిరుపేదలైన బేడ బుడిగి జంగాల కుటుంబాలకు నెలకు రూ.10 వేల ఆదాయం సమకూరే విధంగా తీర్చిదిద్దుతామని, నైపుణ్య శిక్షణ ఇప్పిస్తామని అన్నారు. నాలుగేళ్లుగా కేంద్ర సహకారం లేకున్నా రాష్ట్రాన్ని విభజన కాలం నాటి సంక్షోభం నుంచి కష్టపడి బయటికి తీసుకొచ్చామని, సంక్షేమ కార్యక్రమాలకు ఎక్కడా లోటు రానివ్వకుండా నిధులు కేటాయిస్తూ పేదరిక నిర్మూలనకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం చంద్రబాబు తెలిపారు. సభలో మంత్రులు కళా వెంకటరావు, నక్కా ఆనంద్ బాబు, జవహర్, ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావు, బేడ బుడిగ జంగ నేతలు మధు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.